# బుచ్చిభార్య

శ్రీ రుద్రావఝల సన్యాసిరావు

ఒద్దన్నాడు—శకామరా ఒద్దన్నాడు. నాకు అది బాగులేదన్నాడు. అందం చందం బాగులేదన్నాడు. నాకేం యిష్టంలేదు. చేసినా లాభం లేదన్నాడు. నాకు యిప్పటినుండి వివాహమే వద్దన్నాడు. నా చదువుపూర్తి అవుతేనేగాని దాని విషయమై నావద్ద నూసించకూడదన్నాడు. పెద్దలందరూ నాకు కట్టపెడితే అవుసురంతా మీదే అవుతుందన్నాడు. నేను అసలు ఏలుకోనేమోయని తుదకన్నాడు.

ఆమె కొంచెం నల్లగా యుంటుంది. గాని పెద్దింటి పిల్ల తగుమాత్రం చదువుకుంది. సంగీతకళకూడ యున్నది. తండ్రి కొంచెం వున్నతోద్యోగంలో వున్నాడు ఆమెలో అప్పుడే యౌవ్వనం అంకురించింది తల్లి తండ్రి త్వరపడుచున్నారు పిల్లవివాహానికి.

బుచ్చి స్కూలుఫైనలు చదువుచున్నాడు. ఇంకా బాగా చదవాలని అభిలాషయుంది. కాంగ్రెసు అంటే ప్రాణం పెడతాడు. ప్రపంచభోగట్టా తగుమాత్రం తెలిసినవాడు.

అది కొంచెం దగ్గర సంబంధం. బుచ్చితల్లికి చేసుకోవలెనని బాగా యుంది. పిల్ల మర్యాదస్తురాలని తెలుసు. తన ముసలికాలంలో వేడినీళ్లకు చన్నీళ్లు తోడుగా యుంటుందని ఆశ. బుచ్చికి నచ్చజెప్పాలనుకుంది. బుచ్చిని పిలచింది—సంసారికి చక్కదనమేమిటంది—ఆలి మర్కటం. యిల్లు యిరకటం అన్న పెద్దల వాక్యం జ్ఞాపకం తెచ్చింది. ఈ సంబంధంతోసిపుచ్చితే మర్యాదకు లోపమంది—నలుగురిలో నవుబాటంది—లోకులకు వెరవాలంద—తల్లిమాట అతిక్రమించకూడదని హితోపదేశం చేసింది.

వరుసగా అదే పనిపెట్టి శ్రీకృష్ణుడు అర్జునునికి గీతోపదేశంచేసి నచ్చజెప్పినట్లు బుచ్చితల్లి, బుచ్చికి నచ్చచెప్పింది. దశమిన్నాడే ముహూర్తం. వివాహంలో జట్టి జరుగుతుందని అందరికి భయమేసింది.

తల్లిమాటకు జవదాటడు బుచ్చికాని, ఆపిల్లను చేసుకోవడం యిష్టంలేదు, పెళ్లి ఆరురోజులు తన ముఖాన నవ్వులేదు. కాని జట్టీ పెట్టలేదు. అందుకే అందరూ సంతోషపడ్డారు.

నాలుగు సంవత్సరాలయింది వివాహమై. పిల్ల రజస్వాలా అయి ఆరు మాసాలయింది. ముహూర్తంపెట్టారు కార్యానికి.

రాత్రి ఎనిమిది అయింది. బుచ్చి తల్లికి, పిల్లతల్లికి బెంగ లావయింది. కూతురిని వేరే పిలచి, భర్తకోప్రీతి—చెప్పినపని వెంట వెంటనే చెయ్యి—ఎదురు జబాబు యివ్వకు—అడుగులకు మడుగులొత్తు అని చెప్పి కూతుర్ని గదిలోకి పంపింది. బుచ్చీ జాగ్రత్త సుమా—ఎందరు బంధువులు యిరు ప్రక్కలా వచ్చిరో చూచితివా! ఏమైన మాటపడగలవు సుమా. మూడు రోజులు అతి నెమ్మదిగా పోవలెను. అగుచున్న కార్యము మన యింటి వద్దనే. మాట వచ్చిన మనకే—అది జ్ఞాపకముంచుకొని చాకచక్యముగా మెసులుమని చెప్పి తలుపు ఘడియ పెట్టమన్నది బుచ్చితల్లి.

ముందు పాదములకు నమస్కరించి విసరుచూ బుచ్చిని కుర్చీలో కూర్చుండబెట్టి మిఠాయి పళ్లెములు దగ్గరకు లాగి, ఒక్కొక్కటి చేతికిచ్చి పాలుత్రాగమని సంజ్ఞచేసి, తాను పట్టుకొనిన తమలపాకులను చిలకలగా చుట్టి అందించుచున్నది. బుచ్చికి, అదే మొదటిసారి భార్యను నిదానించి చూచుట. భార్యయొక్క నడవడి చూచి మెచ్చుకొని తల్లిమాటలను జ్ఞాపకము తెచ్చుకొని భార్యను దగ్గరగా అదుముకొని ముద్దులను కురిపించాడు.

ఇప్పుడు ఆమెను వదలి వుండడంబుచ్చికి చాల కష్టం. పుట్టింటికి పంపినా 15రోజుల కన్న ఎక్కువ యుంచడు. తన వెంబడి ఆమెను త్రిప్పుకొనును. ఆమెను ఏమన్నను సహింపడు. సినీమాకుగాని, నాటకమునకుగాని పోవునపుడు వారిద్దరు కలసిపోవలెను. భార్య యిప్పటికి భర్త ఆజ్ఞకు జవదాటదు. ఇద్దరూ చిలుకా గోరింకవలె నున్నారు. తెల్లవారు, ప్రేమించిన దానిని వివాహమాడెదరు. మనము, వివాహమాడినదానిని ప్రేమించుదుము అని బుచ్చి అప్పుడప్పుడు అంటాడు.